
జవహర్‌నగర్‌లో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్


రాకపోకలు నిలిపివేయించిన మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి


గుండ్లపోచంపల్లి రోడ్డుపై పారుతున్న నీరు


రైల్వే బ్రిడ్జి కింద..


హాస్టల్ భవనాల మధ్య ప్రవహిస్తున్న వర్షపు నీరు

వాన కష్టాలు..
ఇన్నిన్ని కాదయా..!

- మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లోని కాలనీలు జలమయమయ్యాయి. పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏ కాలనీలో చూసినా నీరే కనిపించింది. ఎన్‌జీఓ కాలనీ, గోకుల్‌నగర్, రాఘవేంద్రనగర్, రాఘవేంద్రనగర్ కాలనీ, ఏడో వార్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, వినాయక్‌నగర్, కిష్టాపూర్ రోడ్డు, మైసమ్మగూడ గ్రామాల్లో వరద నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు.
- నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టు కాలనీల్లో గురువారం వరద ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాంపల్లి చౌరస్తా నుంచి బీఎంఆర్ కాలనీ, సాయిసంజీవ, మోడీ అపార్టుమెంట్, అరవింద్‌నగర్, బీబీసీకాలనీ, తీవారికాలనీ, వీకర్‌సెక్షన్, ఎస్సీ కాలనీల్లో పెద్ద ఎత్తున వరద ప్రహిస్తోంది. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్, ఇంజినీరింగ్ అధికారులు, పలువురు కౌన్సిలర్లు కాలనీల్లో పర్యటించి వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.
- అన్నోజిగూడలోని ఫ్లైఓవర్ కింద వరద నీరు భారీగా నిలిచింది. చైర్మన్ కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్ పరిశీలించి మున్సిపల్ సిబ్బందిచే వరద సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. అనంతరం నారపల్లిలోని పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు.
- యమ్నంపేట్‌లోని వీకర్ సెక్షన్ కాలనీలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను స్థానిక కౌన్సిలర్ చింతల రాజశేఖర్ గురువారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.
- వెంకటాపూర్ అరుంధతి కాలనీ నీట మునిగింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అరుంధతి కాలనీని సందర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాకు గురికావడంతోనే కాలనీలు ముంపునకు గురవుతున్నాయన్నారు.
- ఘట్‌కేసర్ మండలంలో ముంపు ప్రాంతాలు, చెరువులను మల్కాజిగిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డి, సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి గురువారం సందర్శించారు. పట్టణంలోని బైపాస్ సర్వీస్‌రోడ్డు వద్ద, ఎదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువు అలుగు వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, భారీకేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే మైసమ్మగుట్ట కాలనీలో కూలిన ఇంటిని పరిశీలించారు.
- ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని చెరువులు, వాగులు, కాలువలు ఉప్పొంగుతున్నాయి. పలుచోట్ల పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. అవుటర్ రింగు రోడ్డు శామీర్‌పేట వద్ద ఎంట్రీతో పాటు కీసర, ఘట్‌కేసర్‌ల ఎగ్జిట్‌లను ఓఆర్ఆర్ అధికారులు మూసివేశారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అలియాబాద్ – బాబాగూడ రోడ్డును మూసివేశారు. మూడుచింతలపల్లి – ఉద్దమర్రి గ్రామాల మధ్య వాగు వద్ద కంచె వేశారు.

– మేడ్చల్ జోన్ బృందం


అలుగు పారుతున్న చెన్నాపురం చెరువు


మైసమ్మగూడలోని హాస్టళ్ల విద్యార్థులను ట్రాక్టర్లలో తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది


నాగారం మున్సిపాలిటీలో బీఎంఆర్, బీబీసీ, అరవింద్‌నగర్, సాయిసంజీవ కాలనీలు..


రాంపల్లి చౌరస్తాలో ప్రధాన రహదారిపై వరద


అన్నోజిగూడ ఫ్లైఓవర్ కింది నిలిచిన వరద నీరు


ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట కాలనీలో కూలిన ఇంటిని పరిశీలిస్తూ..


ఉద్దమర్రి వాగు వద్ద రోడ్డును మూసివేసిన పోలీసులు


శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్‌లో ప్రవహిస్తున్న నీరు


మేడ్చల్-గండిమైసమ్మ రోడ్డులో నీటిలో చిక్కుకున్న వాహనాలు


మేడ్చల్-కిష్టాపూర్ రూట్‌లో బ్రిడ్జిపై నుంచి పారుతున్న నీరు


మేడ్చల్-గౌడవెల్లి రూట్‌లో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న నీరు


కొర్రెముల్ బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసి


వెంకటాపూర్ అరుంధతి కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి


గౌడవెల్లి-రాయిలాపూర్ రూట్‌లో..


సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న జవహర్‌నగర్ పోలీసులు

కీసరలో లాటరీ పద్ధతిలో డబుల్ ఇళ్ల ఎంపిక


కీసరలో లక్కీడ్రాతో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న తహసీల్దార్ గౌరివత్సల

కీసర: మండల కేంద్రమైన కీసరలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతోపాటు ఇళ్ల కేటాయింపు ప్రక్రియను గురువారం కీసర తహసీల్దార్ గౌరివత్సల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు కీసరలోని రైతు వేదిక వద్ద లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల కేటాయింపు చేపట్టారు. కీసరలో 95 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా 48 మంది లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కీసర సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, స్థానిక వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కేసీఆర్ కృషి


నాగిశెట్టిపల్లి తండా తీజ్ పండుగలో మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం నాగిశెట్టిపల్లి తండాలో గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. తండాలను సైతం గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన, స్వయంపాలన నిర్వహించుకునేలా చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలన్నారు. గ్రామాలతో సమానంగా తండాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రాన్ని అందజేస్తున్న హరివర్ధన్‌రెడ్డి

శామీర్‌పేట్: కాంగ్రెస్ పార్టీ మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడిగా లక్ష్మాపూర్ గ్రామ ఉపసర్పంచ్ కటికెల వైద్యనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ హరివర్ధన్‌రెడ్డి గురువారం కటికెల వైద్యనాథ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఉద్దమర్రి మాజీ ఎంపీటీసీ వెంకటేశం, జగన్నాథం పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నలుగురు వ్యక్తులను కాపాడిన గ్రామస్తులు



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు గ్రామ పరిధిలోని అలుగు(కాలువ) వద్దకు వెళ్లారు. అలుగు వద్ద ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయారు. స్థానికులు, గ్రామస్తులు వారిని తాళ్ల సాయంతో రక్షించారు.

కాంగ్రెస్ బలోపేతానికి మరింత కృషి


నియామకపత్రం అందుకుంటున్న కందాడి శివరాంరెడ్డి తదితరులు

కీసర: కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కరీంగూడ గ్రామానికి చెందిన కందాడి శివ రాంరెడ్డితోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కీసరకు చెందిన ముద్దం మల్లేష్‌లకు గురువారం ఆయన నియామక పత్రాలను అందజేశారు. కీసర మండల కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి జైహింద్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు జూపల్లి రవీందర్, రామిడి స్వప్న విజయ్‌రెడ్డి, చిక్కుడు రమేష్, దయానంద్‌గౌడ్, సత్తిరెడ్డి, నల్ల మధుసూదన్‌రెడ్డి, రాజుయాదవ్, శ్రీశైలంయాదవ్, ఇందిరాల నర్సింహారెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, మధుయాదవ్, అభిలాష్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేలిన స్కూటర్ బ్యాటరీ

శామీర్‌పేట్: ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ చార్జింగ్ పెడుతుండగా పేలింది. ఈ ఘటన శామీర్‌పేట మండలం పెద్దమ్మకాలనీలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. శామీర్‌పేట పెద్దమ్మ కాలనీకి చెందిన జనన రంజన్ సాహో అనే వ్యక్తి 15 రోజుల క్రితం కూకట్‌పల్లిలోని ప్యూర్ ఈ డ్రైవ్ షో రూంలో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కొనుగోలు చేశాడు. రిమూవబుల్ బ్యాటరీ కావడంతో గురువారం సాయంత్రం బ్యాటరీకి ఇంట్లో చార్జింగ్ పెట్టాడు. బ్యాటరీ పేలి మంటలు వ్యాపించాయి. ఇంట్లోని సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది.

భరోసా సెంటర్ మొదటి వార్షికోత్సవం

మేడ్చల్: మేడ్చల్‌లో భరోసా సెంటర్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి కావడంతో అధికారులు వార్షికోత్సవాన్ని నిర్వహించారు. మేడ్చల్‌లోని భరోసా సెంటర్‌కు డీసీపీ నికిత పంత్ విచ్చేసి బాధితులతో మాట్లాడారు. విక్టిమ్ అసిస్టెంట్స్ ఫండ్ ద్వారా ఇద్దరు బాధితులకు రూ.10 వేల చొప్పున చెక్కులను అందజేశారు. బాధితుల పిల్లలకు బట్టలు, స్కూల్ బ్యాగులుఅందజేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఉమెన్ ఎస్ఐ అంబిక, కౌన్సిలర్ కళ్యాణి, ఏఎన్ఎం శ్రీలత, సమీన తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల త్యాగాలు చిరస్మరణీయం

సీఆర్‌పీఎఫ్ సౌత్ జోన్ డీజీ రవిదీప్‌సింగ్ సాహి



అవార్డు గ్రహీతలతో సీఆర్‌పీఎఫ్ సౌత్ జోన్ డైరెక్టర్ జనరల్ రవిదీప్‌సింగ్ సాహి

జవహర్‌నగర్: దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని సీఆర్‌పీఎఫ్ సౌత్ జోన్ డైరెక్టర్ జనరల్ రవిదీప్‌సింగ్ సాహి అన్నారు. గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో సీఆర్‌పీఎఫ్ 85వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు చేసే సాహసం, త్యాగాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో జవాన్లు ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలను కాపాడటంలో ముందుంటారన్నారు. దేశంలోని ఉగ్రవాద కార్యకలాపాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు వారు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. యుద్ధాల్లో మృతి చెందిన జవాన్ల త్యాగాలు వృధా కావని, దేశానికి సేవ చేయడం అదృష్టమన్నారు. అనంతరం 12 మంది అధికారులకు అవార్డులు అందజేశారు. దివ్యాంగ జవాన్ల కోసం నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి కంప్యూటర్ విభాగంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డీఐజీ అనిల్ మింజ్, జీసీ రంగారెడ్డి, సీఆర్‌పీఎఫ్ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టరేట్ ధర్నాలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని పారిశుధ్య కార్మికులు ముట్టడించారు. కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పారిశుధ్య కార్మికులు రెండు గంటలకు పైగా ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్మికులు 23 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయడం లేదని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా యూనియన్ నేత శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే ఛలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు పీఆర్సీ ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జే.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్య పరిష్కరించాలని చెప్పారు. దళితులైన కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వేధించడం సరికాదన్నారు. ధర్నాలో గ్రామపంచాయతీ కార్మిక యూనియన్ జిల్లా నాయకులు సుధాకర్, రవి, కృష్ణ, శ్రీనివాస్, గిరిబాబు, ఎల్లమ్మ, సీఐటీయూ నాయకులు కిష్టప్ప, ఉన్నికృష్ణ, పప్పు కార్మికులకు పాల్గొన్నారు.

నిజమైన లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి


కీసర-కుషాయిగూడ ప్రధాన రహదారిలో ధర్నాచేస్తున్న కాంగ్రెస్,బీజేపీనేతలు

కీసర: మండల కేంద్రమైన కీసరలో గురువారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో బీఆర్ఎస్ నేతలు, అధికారుల తీరును నిరసిస్తూ కాంగ్రెస్, బీజేపీ నేతలు కీసర–కుషాయిగూడ ప్రధాన రహదారిలో ధర్నా చేపట్టారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు రామిడి స్వప్నవిజయ్‌రెడ్డి, జూపల్లి రవీందర్, బండారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ కీసరలో ఎంతోమంది నిరుపేదలు ఉన్నారని నిజమైన లబ్ధిదారులందరికీ ఇళ్లు కేటాయించాల్సిన పాలకులు, అధికారులు కేవలం 48 మందికి మాత్రమే ఇళ్లు కేటాయించారని మండిపడ్డారు. కీసరలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్వహించిన గ్రామసభలో సుమారు 219 మందిని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం ఎంపికచేసి అందులో కూడా మరోసారి విచారణ జరిపి అర్హులను గుర్తిస్తామని అన్నారని, ఇప్పుడు అన్యాయంగా 120 పేర్లు తొలగించడం ఎంతవరకు సమంజసమన్నారు. మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ స్థానిక నేతలు చెప్పినట్లుగా అధికారులు ఇళ్ల కేటాయింపు చేపట్టడం సరికాదన్నారు.